క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

చిట్టమూరు: మండల పరిధిలోని గునపాటి పాళెం గ్రామంలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి మంగళవారం తెలిపారు. బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ పేరుతో రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమానికి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ హాజరవుతారన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు పార్టీ నేత మారం రెడ్డి శ్రీనివాసులు రెడ్డి నివాసంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు మండల సమావేశం

గూడూరురూరల్ : గూడూరులోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ బూదూరు గురవయ్య అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

పేద విద్యార్థులకు చేయూత


నగదు అందిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్టు ద్వారా అధినేత శ్రీకంఠి రామోహన్‌రావు పేద విద్యార్థులకు చేయూతనివ్వడం ఎంతో అభినందనీయమని రోటరీ వెస్ట్ క్లబ్ అధ్యక్షులు దువ్వూరు విజయ కుమార్‌రెడ్డి అన్నారు. గూడూరులోని ట్రస్టు కార్యాలయంలో మంగళవారం పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని వివిధ పాఠశాలలో చదివే పేద విద్యార్థులు 8 మందికి రూ.1.5 లక్షలను విద్యార్థుల తల్లిదండ్రులకు అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ వెస్ట్ కార్యదర్శి కందాటి రాఘవరెడ్డి, సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాశిన నాగులు, చోళవరం గిరిబాబు, కే సనత్‌కుమార్ రెడ్డి, బండి ధనంజయరెడ్డి, పీ హరినాథ్, లక్ష్మీనారాయణ, వాసు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ


ఎన్‌ఆర్‌ఐని సత్కరిస్తున్న ఉపాధ్యాయినులు

చిల్లకూరు : మండలంలోని వల్లిపేడుకు చెందిన ఎన్‌ఆర్‌ఐ మంగళవారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 20 కుర్చీలు వితరణగా అందించారు. గ్రామానికి చెందిన గన్నంరాజు సతీష్ వారి తల్లిదండ్రులు, సూర్య ప్రకాష్‌రావు, అచ్యుత రాజేశ్వరమ్మల జ్ఞాపకార్థం పాఠశాలలో 20 కుర్చీలను అందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన వసతులు కల్పించేందుకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. ఉపాధ్యాయులు, స్థానికులు ఎన్‌ఆర్‌ఐ సతీష్‌ను శాలువలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మధుకర్, ఉపాధ్యాయులు శేషయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

కండలేరులో 28.342 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 28.342టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,200, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 100, హైలెవల్ కాలువకు 10, మొదటిబ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నరేంద్రరెడ్డి



పెళ్లకూరు: భారతీయ జనతా పార్టీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడుగా రెండో పర్యాయం ఎద్దల నరేంద్రరెడ్డిని నియమించినట్లు మంగళవారం ఆపార్టీ మండల అధ్యక్షుడు నరసింహులు తెలిపారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడుగా కొనసాగుతున్న నరేంద్రరెడ్డిని రెండోసారి నియమించడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలియజేశారు.

డీఎస్పీ ఆకస్మిక తనిఖీ

సైదాపురం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట రాపూరు సీఐ నరసయ్య, ఎస్‌ఐ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు		23.07.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	134
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	264
లేయర్ చికెన్	:	190

యమలోకానికి రహదారులు


ప్రమాదకరంగా మారిన సైదాపురం-పాదలకూరు రహదారి


రోడ్డుపై బావుల్లాగా ఉన్న గుంతలు


బురదగుంటలా మారిన ప్రధాన రహదారి

సైదాపురం: అధికారంలోకి రాగానే రోడ్లేసేశామని డప్పుకొట్టుకుంటున్న కూటమి నాయకులకు ఈ రోడ్లు కనపించలేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సైదాపురం-పాదలకూరు రోడ్డు ఆధునీకరణ పనులకు గత ప్రభుత్వం రూ.43 కోట్ల నిధులను మంజూరు చేసింది. 24 కిలో మీటర్ల పొడవు ఉన్న ఈ రహదారి పనులను మూడు నెలలు నుంచి ఈ రహదారి పనులన్నీ పూర్తిగా నిలిపివేశారు. అప్పటి నుంచి రహదారి మరింత దారుణంగా మారింది. ఉన్న వంతెనల వద్ద ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై అడుకో గుంత ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనాలు పాడైపోతున్నాయి. వెంకటగిరి-నెల్లూరుకు పోవు రహదారి మరీ దారుణంగా ఉంది. బాలాయపల్లి నుంచి అమ్మపాళెం వరకు ప్రయాణం ఓ నరకంగా మారింది.

ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ దారుణం


కామిరెడ్డి కస్తూర్ రెడ్డి

చిట్టమూరు: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిపై అక్రమ కేసు పెట్టి విచారణకు పిలిచి అరెస్ట్ చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి కస్తూర్ రెడ్డి అన్నారు. చిట్టమూరులో ఆయన మంగళవారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను పక్కదోవ పట్టించేందుకు లేని మద్యం కేసును సృష్టించి కక్షపూరితంగా మిథున్ రెడ్డిని ఇరికించి జైలు పాలు చేసి రాక్షసానందం పొందుతోందన్నారు. ప్రజలు గుణపాఠం చెబుతారని చెప్పారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన కామిరెడ్డి



మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మాజీ మంత్రిని కలిసిన గూడూరు వైఎస్సార్‌సీపీ నాయకులు

పెళ్లకూరు: మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మంగళవారం డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి కలిశారు. ఇటీవల రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడంపై మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతోపాటు ఆయన తిరుపతిలోని పెద్దిరెడ్డి నివాసంలో కలిసి మాట్లాడారు. వీరి వెంట పార్టీ నాయకులు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, కలికి మాధవరెడ్డి, హరినాథ్‌రెడ్డి ఉన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

గూడూరురూరల్ : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మంగళవారం తిరుపతిలోని ఆయన నివాసంలో గూడూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. కూటమి ప్రభుత్వం అక్రమంగా కేసులు బనాయించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటామని పేర్కొన్నారు. పెద్దిరెడ్డిని కలిసిన వారిలో ఊటుకూరు మహేంద్రరెడ్డి, రవీంద్రారెడ్డి, తిరుపాలయ్య, గోపాల్, పెంచలయ్య, రమణయ్య ఉన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు


నూతన విభాగాన్ని ప్రారంభిస్తున్న డివిజన్ సూపరింటెండెంట్ మురళీ కుమార్

చిల్లకూరు: తపాలా శాఖ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు సరికొత్తగా ముందుకు వస్తోందని గూడూరు డివిజన్ సూపరింటెండెంట్ మురళీకుమార్ తెలిపారు. పట్టణంలోని ప్రధాన తపాల కార్యాలయంలో మంగళవారం నూతన విభాగాన్ని ఆయన ప్రారంభించారు. మురళీకుమార్ మాట్లాడుతూ తపాలా శాఖ గతంలో మాదిరిగా లేఖలు అందించడమే కాకుండా సేవా కార్యక్రమాలకు, బీమా సౌకర్యం, బ్యాంకుల లాగా ఫిక్సెడ్ డిపాజిట్ల స్వీకరణలాంటి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మణిగండన్, పోస్టుమాస్టర్ నజీముద్దీన్, ఐపీ సుధీర్‌బాబు, కిరణ్‌కుమార్ నాయక్, సురేష్, ఫైరోజ్ పాల్గొన్నారు.

కోట ఏఓ శివకుమార్ సస్పెన్షన్

సైదాపురం: ప్రస్తుతం కోట ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న పి శివకుమార్‌ను సస్పెన్షన్ చేస్తూ బుధవారం నెల్లూరు జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈఓ జె మోహన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సైదాపురం మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పి శివకుమార్ వ్యవహరించారు. ఆ సమయంలో పలు అవినీతి ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శివకుమార్‌ను విధులను నుంచి తొలగిస్తున్నట్లు సీఈఓ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విచారణ పూర్తి అయ్యేంత వరకు ఆయనను విధులను నుంచి తొలగించడంతో పాటు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయానికి సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లకూడదని ఆ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్ట్

దొరవారిసత్రం: హత్యాయత్నం కేసులో ఒకరిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు, వెదురుపట్టు గ్రామానికి చెందిన పోలయ్య అదే గ్రామానికి చెందిన సమీప బంధువుల మధ్య భూ వివాదం ఏర్పడింది. దీంతో పోలయ్యను నాలుగు రోజుల కిందట వెదురుపట్టు మార్గం మధ్యలో అనవల మోహన్, నాగముంతల సుధాకర్ రాత్రి సమయంలో కాపుకాసి కత్తితో దాడి చేసి గాయపరిచారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అజయ్‌కుమార్ కేసు నమోదు చేసి రెండో నిందితుడు సుధాకర్‌ను మంగళవారం అరెస్ట్ చేసి సూళ్లూరుపేట కోర్టులో హాజరు పరిచినట్లు తెలియజేశారు. పరారీలో ఉన్న మోహన్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూలీలు 4 గంటలు పని చేయాలి


కూలీల హాజరును పరిశీలిస్తున్న ఏపీడీ వరకుమార్

దక్కిలి: ఉపాధి హామీ కూలీలు ప్రతి రోజూ నాలుగు గంటలకు తగ్గకుండా పని చేయాలని ఏపీడీ వరకుమార్ తెలిపారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 100 రోజులు పని కల్పించాలన్నారు. ఆగస్టు 1వ తేదీ నుంచి తప్పనిసరిగా ఉదయం సాయంత్రం యాప్‌లో రెండు సార్లు ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. లేకపోతే ఉదయం 6గంటలకు పని ప్రదేశానికి చేరుకుని 10 గంటల వరకు పని చేసి రెండు సార్లు ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తేనే కూలీలకు గిట్టుబాటు కూలీ నగదు రూ.307 వస్తుందన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

గూడూరు రూరల్: పరిశ్రమల్లో ప్రమాదాలపై తగు జాగ్రత్తలు తీసుకుని పటిష్ట చర్యలు చేపట్టాలని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆదేశించారు. ఆయన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం డివిజన్ స్థాయి ఎల్‌సీజీ సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ పరిశ్రమల్లో కార్మికులు, ప్రజల భద్రత, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన భద్రతా చర్యలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి, గూడూరు అగ్నిమాపక అధికారి రమణయ్య, ఎంపీడీఓ మధుసూదన్‌రావు, వైద్యులు డాక్టర్ రోహిత్‌రెడ్డి, డాక్టర్ రేష్మ, డాక్టర్ జ్యోతి, పరిశ్రమల ప్రతినిధులు, ఎల్‌సీజీ సభ్యులు పాల్గొన్నారు.

మా ఊరి పాఠశాలను కొనసాగించాలి


పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు

దొరవారిసత్రం: కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు తమ పిల్లలను పంపలేమని, మా ఊరి బడిని కొనసాగించాలంటూ మండలంలోని ఉచ్చూరు గ్రామస్తులు పాఠశాల వద్ద మంగళవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉచ్చూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సూళ్లూరుపేట మండలం మంగళంపాడు పాఠశాలలో విలీనం చేసిందని చెప్పారు. సుమారు రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు పంపడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. ఉచ్చూరు గ్రామ పరిధిలోని ఎస్టీ కాలనీకి చెందిన ఆరుగురు విద్యార్థులు బడికెళ్లలేక ఇంటి వద్దనే పనులు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామాల్లో శుభ్రతపై ప్రత్యేక దృష్టి

సైదాపురం: గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. మండలంలోని పొక్కందల గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పంచాయతీ రికార్డులు పక్కాగా నిర్వహించాలి

సైదాపురం: గ్రామ పంచాయతీలకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ రవీంద్రబాబు ఆదేశించారు. మండల కేంద్రంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో ఉన్న 34 రకాల రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని కోరారు. పీ-4 సర్వే ద్వారా గుర్తించిన బంగారు కుటుంబాల వారికి సహాయం అందించే మార్గదర్శకాలకు దత్తత తీసుకునేలా అవగాహన కలిగించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నారాయణ, ఏఓ మురళి తదితరులు హాజరయ్యారు.

చుక్కల మందు తప్పనిసరి

చిల్లకూరు : గ్రామీణ ప్రాంతాల్లో ఉండే గర్భిణులు, బాలింతలు, 5 ఏళ్ల లోపు పిల్లలకు చుక్కల మందులు, టీకాలు (వ్యాక్సినేషన్) క్రమం తప్పక వేసేలా చూసుకోవాలని చిల్లకూరు వైద్యులు ఆరాఫత్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండలంలోని అన్ని సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలలో పని చేసే వైద్య సిబ్బందికి వ్యాక్సి నేషన్‌పై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని యూ విన్ ట్రేనీ శివ రామకృష్ణ ద్వారా శిక్షణ అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవి తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులతో సమీక్ష

వాకాడు : మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాసులు సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అత్యంత పేదరిక కుటుంబాలను గుర్తించి తెలుగు ప్రవాసులు, సంపన్నుల సహకారంతో పేదరికాన్ని నిర్మూలించాలని చెప్పారు. మండలంలో 1,979 మంది కడు పేదరికంతో ఉన్నట్లు గుర్తించినట్లు వివరించారు. అందులో 1,548 మందిని దత్తత తీసుకుని అభివృద్ధి చేసేలా కార్యదర్శులకు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు వివరించారు.

బాబు మోసాలను ఎండగడదాం


క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మేరిగ మురళీధర్, నాయకులు


పార్టీలో చేరిన వారికి కండువాలు వేసిన ఎమ్మెల్సీ

కోట: వైఎస్సార్ కార్యకర్తలు, క్రియాశీలక నాయకులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను ఎండగడదామని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పిలుపునిచ్చారు. విద్యానగర్ నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో మంగళవారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని పార్టీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మేరిగ మురళీధర్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యకర్తల మాటే జగనన్న బాట అన్నారు. జగనన్న పాలనలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చారని గుర్తుచేశారు. చంద్రబాబునాయుడు ఈ 13 నెలల్లో సూపర్‌సిక్స్ హామీలేవీ నెరవేర్చలేదని చెప్పారు. బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నియోజకవర్గంలో రాజకీయం ముసుగులో రౌడీయిజం చెలాయిస్తున్నారని, ప్రశ్నిస్తే కేసులు పెడతున్నారని ధ్వజమెత్తారు. అనంతరం బాబు షూరిటీ-మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కొడవలూరు ధనుంజయరెడ్డిని మేరిగ మురళీధర్ ఘనంగా సన్మానించారు.

పార్టీలో చేరికలు

కోట, జరుగుమల్లి గ్రామాల నుంచి వందమంది వైఎస్సార్‌సీపీలో చేరగా, వారికి మేరిగ మురళీధర్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, డి.రమణారెడ్డి, వై.మధుసూదన్‌రెడ్డి, పి.రాధాక్రిష్ణారెడ్డి, సాయిరెడ్డి, నాగూర్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, జెడ్పీటీసీ కోటయ్య, ఎన్‌వీ రమణయ్య, సుధారెడ్డి, శశిరెడ్డి, పి.సురేంద్ర పాల్గొన్నారు.

కారు-బైక్ ఢీ ఒకరికి గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు, బైక్

వాకాడు: మండల కేంద్రంలో కారు బైక్ ఢీకొనడంతో ఒకరికి గాయాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు కోట నుంచి వాకాడు వైపు కారు బయల్దేరిన కారు, బైక్ స్వర్ణముఖి బ్యారేజ్ రహదారిపై ఢీ కొన్నాయి. బైక్ మీద వెళుతున్న పల్లెపాళ్యానికి చెందిన యువకుడు అజయ్ గాయపడ్డాడు. బైక్‌తోపాటు కారు ముందుభాగం బాగా దెబ్బతింది. బలంగా ఢీకొట్టడంతో కారులోని ఎయిర్ బాగ్స్ సైతం ఓపెన్ అయ్యాయి. క్షతగాత్రుడిని వాకాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రకృతి వ్యవసాయం.. మెరుగైన ఆరోగ్యం


పీఎండీఎస్ కిట్లు అందజేస్తున్న డీపీఎం షణ్ముగం, వ్యవసాయాధికారులు

గూడూరురూరల్ : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులతో మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని రైతు సాధికార సంస్థ డీపీఎం షణ్ముగం అన్నారు. వ్యవసాయశాఖ ఏడీ కార్యాలయం వద్ద మంగళవారం 200 ఎకరాలకు సరిపడా పీఎండీఎస్ కిట్లు పంపిణీ చేశారు. గడ్డిజాతి, ఆకు కూరలు, తీగజాతి, కాయకూరలు, సుగంధ ద్రవ్యాలు వంటి 18 రకాల విత్తనాలు ఈ కిట్‌లో ఉంటాయని, ఎకరాకు 12 కిలోల చొప్పున చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం పట్టాభి రెడ్డి, డిస్ట్రిక్ట్ యాంకర్ రవిచంద్ర ప్రసాద్, గూడూరు వ్యవసాయశాఖ ఏడీ గోపీ నాయక్, వ్యవసాయాధికారి రమేష్, వెలుగు ఏపీఎం బుజ్జమ్మ పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరిస్తాం

గూడూరురూరల్ : పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతుల సమస్యలు పరిష్కరించనున్నట్లు మండల వ్యవసాయాధికారి రమేష్ అన్నారు. మండలంలోని రామలింగాపురం, మిట్టాత్మకూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటకు అవసరమైన మేరకే రసాయన, పురుగు మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామలింగాపురం, మిట్టాత్మకూరు గ్రామ వ్యవసాయ సహాయకులు కల్యాణి, శివ శంకర్, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

సైదాపురం: మేలైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే వరి సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ హైమావతి తెలిపారు. మండలంలోని కమ్మవారిపల్లిలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విత్తన ఎంపిక నుంచి పంట దిగుబడి వరకు తగిన అవగాహన ఉండాలన్నారు. అధిక యూరియా వాడడం వల్ల తాలు గింజలు ఏర్పడంతో పాటు దోమపోటుకు గురయ్యే అవకాశం ఉందని చెప్పారు. అన్నదాత సుఖీభవకు తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

ఈ క్రాప్‌ను నమోదు చేసుకోవాలి

కలువాయి (సైదాపురం): రైతులు తాము సాగు చేసే ప్రతి పంటను ఈ-క్రాప్ కింద నమోదు చేసుకోవాలని ఏఓ కళారాణి కోరారు. మండలంలోని కుల్లూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి వన్‌బిలో ఆధార్ లింక్ చేసుకోవాలన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఆమె వివరించారు. యూరియా కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో వృక్షో రక్షతి రక్షితః

సూళ్లూరుపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, యధుముడి స్వచ్ఛంద సేవా సంస్థ వారు మంగళవారం సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. వృక్షో రక్షతి రక్షితః అని నినదిస్తూ ఒక్క మొక్క నాటి దాన్ని పెంచి పెద్దచేయడానికి కృషి చేయాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌ఎల్‌బి శంకరశర్మ విద్యార్థులందరికీ సూచించారు.